## సర్వేను పరిశీలించిన సబ్ కలెక్టర్

కాగజ్‌నగర్, అక్టోబర్ 4 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అధికారులకు సూచించారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో కొనసాగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఏరియాల్లో ఈ నెల 9వ తేదీలోగా సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో రమేశ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.


సర్వే వివరాలు సేకరిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

## తాగు నీటి కోసం మహిళల ధర్నా

దహెగాం, అక్టోబర్ 4 : తాగు నీరందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీబ్రా గ్రామంలో మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఎస్సీకాలనీకి వచ్చే పైపులైన్ పాడైపోవడంతో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, తాగు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నామని, ఈ విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంపీడీవో రాజేందర్‌ను వివరణ కోరగా గురువారం నాడే పైపులైన్‌లకు మరమ్మతులు చేపట్టామని, ఎస్సీ కాలనీకి నీళ్లు అందిస్తున్నామని, తాగునీటి సమస్య లేదని పేర్కొన్నారు.


బీబ్రాలో ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు


కూల్చివేసిన దుకాణాలను పరిశీలిస్తున్న మాజీ దివాకర్‌రావు

# కూల్చివేతలపై అత్యుత్సాహమెందుకు?

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆగ్రహం
- వ్యాపారులకు అండగా ఉంటామని భరోసా

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 4 : మంచిర్యాలలో ఆక్రమణల పేరిట దుకాణాలను కూల్చివేయడం సరికాదని, ఈ విషయంలో మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ అధికారులు కూల్చివేసిన దుకాణాల యజమానులను ఆయన కలిసి ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దివాకర్‌రావు మాట్లాడుతూ కూల్చివేతల సంఘటన ఎంతో బాధ కలిగించిందన్నారు. కూల్చివేతల వల్ల వ్యాపారుల గిరాకీ దెబ్బతిన్నదన్నారు. కేసీఆర్ సర్కారులో ఏనాడూ ఎవరికీ నష్టం చేయలేదని, అందరికీ అండగా నిలిచామని గుర్తు చేశారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పిన ప్రకారం రాత్రి మార్కింగ్ ఇచ్చి ఉదయాన్నే కూల్చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. వ్యాపారులకు నష్టం కలగకుండా కొంత సమయం ఇవ్వాల్సి ఉండేదని, పండుగ ముందు ఏం ముంచుకొచ్చిందని కూల్చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రోజూ కూలగొట్టే కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఎంగిలిపూల బతుకమ్మ రోజు పూలు కూడా అమ్ముకోనియ్యలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, ఏ నరేశ్, చంద్రశేఖర్ హండే, రమేశ్, పడాల రవిందర్, పల్లె రాజన్న, గట్టయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కో న్యాయం మాకో న్యాయమా?

**శనిగకుంట మత్తడి ధ్వంసం కేసులో పోలీసుల వైఖరిపై బీఆర్‌ఎస్ మండిపాటు**

- చెన్నూర్ పట్టణంలో నిరసన ర్యాలీ, ధర్నా
- అడ్డుకున్న పోలీసులు
- పెనుగులాటలో గాయపడిన గులాబీ నేతలు


బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి నాయకుడు రాజారమేశ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

చెన్నూర్, అక్టోబర్ 4 : 'శనిగకుంట చెరువు మత్తడి పేల్చివేత కేసులో ఎమ్మెల్యే వివేక్ సన్నిహితులను వదిలేసి, ఎలాంటి సంబంధంలేని మా పార్టీ నాయకులను అరెస్టు చేశారు. కాంగ్రెస్ నేతలకో న్యాయం.. మాకో న్యాయమా' అంటూ బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసుల వైఖరిని నిరసిస్తూ శుక్రవారం చెన్నూర్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ తీశారు. ధర్నా చేపట్టి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి నాయకుడు రాజారమేశ్ మాట్లాడుతూ శనిగకుంట చెరువు మత్తడి ధ్వంసం కేసులో కీలకమైన వ్యక్తులను వదిలేసి, బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. పోలీసులు ధర్నా వద్దకు చేరుకొని గులాబీ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేయగా, వారు వినిపించుకోకుండా ఆందోళన కొనసాగించారు. దీంతో పోలీసులు బలవంతంగా వారిని అక్కడి నుంచి తొలగిస్తుండగా పెనుగులాట జరిగి మున్సిపాలిటీ కౌన్సిలర్ దోమకొండ అనిల్ స్పృహతప్పి పడియారు. మరో కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ గాయపడ్డారు. అనిల్‌ను చికిత్స కోసం చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. పోలీసులు పలువురు బీఆర్‌ఎస్ నాయకులను బలవంతంగా స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, మాజీ ఎంపీపీ మంత్రి బాపు, బీఆర్‌ఎస్ భీమారం మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, దోమకొండ అనిల్, తుమ్మ రమేశ్, జోడు శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు సాధనబోయిన కృష్ణ, ఆరీఫ్, రాజారాం, జడల మల్లేశ్, షఫీ, జిలానీ, వీరమల్ల రాము, జైపూర్ మల్లేశ్, సురేశ్, చిన్ని, ఆసంపల్లి సంపత్, భారతి తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు


పోలీసు పెనుగులాటలో స్పృహతప్పి పడిపోయిన కౌన్సిలర్ అనిల్

### పక్షపాత వైఖరి శోచనీయం

శనిగకుంట చెరువు మత్తడి పేల్చివేత కేసులో ప్రభుత్వం పక్షపాత వైఖరిని ప్రదర్శించడం శోచనీయమని, పోలీసులపై ఒత్తిడి తెచ్చి కాంగ్రెస్ పార్టీ నాయకులను ఈ కేసు నుంచి తప్పించారని బీజేపీ పార్టీ పార్లమెంటు కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం చెన్నూర్‌లో ఆయన మాట్లాడుతూ ఈ కేసులో ఎమ్మెల్యే వివేక్ నిష్పక్షికంగా వ్యవహరించాలని, ఎన్ఐఏకు కేసును అప్పగించి విచారణకు సహకరించాలని కోరారు. బీజేపీ నాయకులు వెంకటనర్సయ్య, శ్రీపాల్, కమ్మల శ్రీనివాస్, కేవీఎం శ్రీనివాస్, మానికరౌతు శంకర్, తలారి రాజు పాల్గొన్నారు.


మంచిర్యాల : సర్వేలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

# ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా చేపట్టాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 4 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపాలిటీలోని 16వ వార్డు అశోక్‌రోడ్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను ప్రారంభించారు. మంచిర్యాల ఆర్డీవో వాడాల రాములు, మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది సర్వే నిర్వహించారు. సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా పొందుపరచాలన్నారు. మూడు రోజుల్లో సర్వేను పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని, ఇందుకోసం అధికారులు, ఉద్యోగులు పూర్తి స్థాయిలో కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### పొరపాట్లు లేకుండా చూడాలి

దండేపల్లి, అక్టోబర్ 4 : ఫ్యామిలి డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం అల్లీపూర్ గ్రామంలో చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల నుంచి వివరాలు సేకరించాలన్నారు. అనంతరం కర్ణపేటలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. దసరా సెలవులు ముగిసేలోగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్ ఉన్నారు.

# ఎమ్మెల్యే డైరెక్షన్‌లోనే మత్తడి పేల్చివేత కేసు

- వివేక్ ఒత్తిడితోనే బాపురెడ్డిని వదిలేశారు
- బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి నాయకుడు రాజారమేశ్
- మరోసారి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్

చెన్నూర్, అక్టోబర్ 4 : శనిగకుంట చెరువు మత్తడి పేల్చివేత కేసు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి డైరెక్షన్‌లోనే సాగుతుందని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకుడు రాజారమేశ్ ఆరోపించారు. శుక్రవారం చెన్నూర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి విడుదల చేసిన వీడియోలో మత్తడి పేల్చివేతలో బీఆర్‌ఎస్, బీజేపీవాళ్లు ఉన్నారని, కాంగ్రెస్ వాళ్లు లేరని చెప్పారని, ఆయన చెప్పిన విధంగానే డీసీపీ, ఏసీపీ, చెన్నూర్ సీఐ నడుచుకుంటున్నారని పేర్కొన్నారు. పోలీసులంటే అత్యంత గౌరవముందని, నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కోరారు. పోలీసులు స్థాయిని దిగజార్చుకొని కాంగ్రెస్ నాయకుడు బాపురెడ్డిని గారు అని, రూ. 4 కోట్లు పెట్టి భూమి కొనుక్కున్నారని డీసీపీ మాట్లాడారని గుర్తు చేశారు. బాపురెడ్డికి రూ. 4 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి.. ఆ డబ్బులకు ఇన్‌కాం ట్యాక్స్ కట్టాడా.. అది వైట్ మనీనా లేక బ్లాక్ మనీనా.. అనే విషయాన్ని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత డీసీపీపై ఉందని పేర్కొన్నారు. చెరువు మత్తడి పేల్చితే అత్యధికంగా లాభపడే వ్యక్తి కాంగ్రెస్ నాయకుడు బాపురెడ్డియేనని ఆయన పేర్కొన్నారు. ఇందులో కాంగ్రెస్ నాయకుడు బాపురెడ్డితో పాటు ఇంకో సూత్రధారి ఉన్నారని చెప్పారు. ఈ షాడో ఎమ్మెల్యే 25 శాతం పర్సంటేజీ కోసం బాపురెడ్డి వెనుక ఉండి నడిపిస్తున్నాడని, ఈ కేసులో బాపురెడ్డిని రక్షించి డబ్బులు దండుకోవాలనే ఆలోచనలో ఆయన ఉన్నారని ఆరోపించారు. ఈ కేసులో కాంగ్రెస్ నాయకుడు బాపురెడ్డి దోషే కాకపోతే తెల్లవారు జామున 4 గంటలకు అంతమంది పోలీసులతో ఇంటి మీద ఎందుకు దాడి చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. పారిపోతున్న బాపురెడ్డిని పరిగెత్తుకెళ్లి మరీ పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ఆయన పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి కాల్‌డాటా తెప్పించిన తర్వాతే బాపురెడ్డిని తెల్లవారుజామున పట్టుకెళ్లారని, ఎమ్మెల్యే వివేక్ ఒత్తిడితోనే ఈ రోజు కాంగ్రెస్ నాయకుడు బాపురెడ్డిని పోలీసులు వదిలి పెట్టారని ఆయన ఆరోపించారు. బాంబులు పేల్చితే అవి ఎవరు తెచ్చారు, ఇప్పించిన వారెవరు.. వారిని అరెస్టు చేసే బాధ్యత పోలీసుల మీద లేదా అంటూ ప్రశ్నించారు. ఇప్పుడు చెరువు మత్తడినే పేల్చారు, అదే పోలీసుస్టేషన్‌ను పేల్చితే అప్పుడేమి చేస్తారన్నారు. మరోసారి నిష్పక్షపాతంగా విచారణ జరిపి అసలైన దోషులను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ కేసులో పోలీసులు అరెస్టు చేసిన వారిని విచారిస్తే ఇందులో బాపురెడ్డి ప్రమేయం ఉందని ప్రతి ఒక్కరూ చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, మాజీ ఎంపీపీ మంత్రి బాపు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకుడు రాజారమేశ్


జైపూర్ ఏసీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్


అరెస్టయిన వారిలో రాంలాల్ గిల్డా, బత్తుల సమ్మయ్య

# మరో ముగ్గురి అరెస్టు

**వివరాలు వెల్లడించిన ఏసీపీ వెంకటేశ్వర్**

జైపూర్, అక్టోబర్ 4 : శనిగకుంట మత్తడి ధ్వంసం కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం జైపూర్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్.. చెన్నూర్ సీఐ రవీందర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శనిగకుంట మత్తడి పేల్చి వేత కేసులో ఇప్పటికే 11 మందిని అరెస్టు చేయగా, పరారీలో ఉన్న ఏ5 బత్తుల సమ్మయ్య, ఏ6 రాంలాల్ గిల్డా, ఏ14 ఎన్నం బానయ్యను చెన్నూర్ పట్టణంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్16న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పేలుడు పదార్థాలతో చెరువు మత్తడిని ధ్వంసం చేశారని, చెన్నూర్ ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 20న ప్రధాన నిందితులైన ఏ1 పెండ్యాల లక్ష్మీనారాయణ అలియాస్ లక్ష్మణ్, ఏ2 బీం మధూకర్, ఏ3 రసమల్ల శ్రీనివాస్, ఏ4 గోగుల దానయ్యను అరెస్టు చేశామని తెలిపారు. వీరికి సహకరించిన ఏ7 నడిపెల్లి లక్ష్మణ్‌రావు, ఏ8 మంచాల రాజబాపు, ఏ9 పెద్దింటి శ్రీనివాస్, ఏ10 లక్కం రాజబాపు, ఏ7 పోగుల శేఖర్, ఏ 12 ఇప్ప సంపత్, ఏ13 ఉమేశ్ గిల్డాలను ఈ నెల 3న అరెస్టు చేశామన్నారు. ప్రధాన నిందితులతో పాటు వారికి సహకరించిన వారందరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

# నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో జీవితాలు చిన్నాభిన్నం

**రామగుండం సీపీ శ్రీనివాస్**

బెల్లంపల్లి, అక్టోబర్ 4 : నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో జీవితాలు చిన్నాభిన్నమవుతాయని రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని 200 మంది పోలీస్ వాహనాల డ్రైవర్లకు శిక్షణ, అవగాహన కల్పించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై డ్రైవర్లకు సలహాలు అందించారు. ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అతివేగం ప్రమాదాలకు కారణమని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ డ్రైవింగ్ చేయాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, ఆర్ఐ ఎండీవో సంపత్, ఆర్ఐ వామనమూర్తి, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలు అందుకున్న వాహనాల సిబ్బందితో సీపీ శ్రీనివాస్

# జోరుగా మద్యం దందా

- పల్లెల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు
- ఒక్కో బాటిల్‌పై రూ. 20 నుంచి రూ. 30 దాకా వసూలు
- పేదల జీవితాలపై తీవ్ర ప్రభావం
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు
- కాంగ్రెస్ హామీ గాలికి
- ఇటీవల కోసినిలో మహిళల రాస్తారోకో


కాగజ్‌నగర్ మండలం కోసినిలో బెల్టు దుకాణాలను తొలగించాలని రాస్తారోకో చేస్తున్న మహిళలు (ఫైల్)

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఊరూరా బెల్టు షాపుల్లో మద్యం దందా జోరుగా సాగుతున్నది. ఎక్కడ చూసినా రెండు మూడు దుకాణాలుండడం సర్వసాధారం కాగా, నివారించాల్సిన అధికారులు 'మామూలు'గా తీసుకోవడం విమర్శలకు తావిస్తున్నది. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 32 వైన్స్‌లు ఉండగా, పల్లెల్లో 700 వరకు బెల్టు షాపులు నడుస్తున్నట్లు తెలుస్తున్నది. కొందరు మద్యాన్ని ఎక్కువ ధరకు విక్రయిస్తూ అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. వైన్స్‌ల యజమానులు ఒక్కో బాటిల్‌పై రూ. 10 అదనంగా తీసుకుంటుండగా, బెల్టుషాపుల్లో మాత్రం ఒక్కో మద్యం బాటిల్‌పై రూ. 20 నుంచి రూ. 30 దాకా వసూలు చేస్తున్నారు. దాదాపు కిరాణాలన్నీ బెల్టుషాపులుగా మారాయి. మండల కేంద్రాల్లో ఉన్న వైన్స్‌లకు రాలేని మందుబాబులు తమ ఊరిలో దొరికే బెల్టు షాపుల్లోనే మద్యాన్ని ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పల్లెల్లో విచ్చలవిడిగా వెలసిన బెల్టు షాపులు పేదలు, యువకుల జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. పొద్దంతా రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించిన సొమ్మంతా మద్యానికే ఖర్చు చేస్తున్నారంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బెల్టు షాపులు మూసివేయించాలని కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామానికి చెందిన మహిళలు రహదారిపై ధర్నా నిర్వహించిన విషయం విదితమే.

**అంతా సిండికేట్..**

సిండికేట్‌గా మారిన మద్యం వ్యాపారులు మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఒక్కో మద్యం బాటిల్‌పై ఎమ్మార్పీకంటే రూ. 10 అదనంగా వసూలు చేస్తున్నారు. మద్యం వ్యాపారుల సిండిట్ దందా గురించి ఎక్సైజ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల సిర్పూర్ డివిజన్‌లోని ఓ వైన్‌షాపులో తనిఖీకి వెళ్లిన ఎక్సైజ్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వెనుదిరిగినట్లు తెలిసింది. ఈ ఘటనను బట్టిచూస్తుంటే మద్యం వ్యాపారుల సిండికేట్ వెనుక అధికారులతో పాటు రాజకీయనాయకుల అండదండలున్నట్లు తెలుస్తున్నది. పల్లెల్లో మద్యం ఏరులై పారుతున్నా అధికారులు 'మామూలు'గా తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఎన్నికల సమయంలో బెల్టు షాపులన్నీ ఎత్తేస్తామన్న కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదు.



రికార్డులను పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

# సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్
- దేవాపూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

కాసిపేట, అక్టోబర్ 4 : ప్రతి ఊరిలో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం దేవాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రికార్డులు పరిశీలించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేసుల గురించి చర్చించారు. ప్రజలు, యువకులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఏదైనా సమాచారం వచ్చిన వెంటనే స్పందించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా పెట్టాలని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, ఎస్ఐ ఆంజనేయులు ఉన్నారు.

# అల్లీపూర్ చెరువు శిఖం కబ్జా

- 8.31 ఎకరాలు స్వాహా చేసినట్లు గుర్తించిన అధికారులు
- 21 మందికి నోటీసులు

దండేపల్లి, అక్టోబర్4 : అల్లీపూర్ చెరువులో 8.31 ఎకరాల శిఖం కబ్జాకు గురైనట్లు అధికారులు వెల్లడించారు. చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురైందని గతంలో పలువురు కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు సర్వే చేపట్టగా, ఆక్రమణలు వెలుగులోకి వచ్చాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 23న జిల్లా సర్వేయర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. అల్లీపూర్ శివారులోని సర్వే నంబర్ 100లో చెరువు ఉంది. చెరువు పూర్తి విస్తీర్ణం59.39 ఎకరాలు కాగా, చెరువును ఆనుకొని ఉన్న 8.31 ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారులు వెల్లడించారు. కబ్జాలకు పాల్పడ్డ 21 మందికి నోటీసులిచ్చామని, వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు.